క్లుప్తంగా

పొన్నారంలో బోరుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: నెల రోజులుగా పొన్నారం గ్రామంలోని ఎస్సీ కాల నీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'పొన్నారంలో తాగునీటికి అవస్థలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత అధికారులు బోరుకు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

కేకే-ఓసీలో భోజన సౌకర్యం కొనసాగించాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీ క్యాంటీన్‌లో కూరగాయల ధరలు పెరిగాయని, గనిపై నోటీస్‌బోర్డు అంటించి భోజన సౌకర్యం నిలిపేసారని, తిరిగి వెంటనే కొనసాగించాలని సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల టర్నోవర్ ఉన్న సింగరేణి సంస్థలో, కార్మిక సంక్షేమానికి కోతలు విధించడం విడ్డూరమని మండిపడ్డారు. క్యాంటీన్ బడ్జెట్‌ను ప్రస్తుల ధరలకు అనుగుణంగా పెంచి సబ్సిడీపై భోజన సౌకర్యం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ముగిసిందని, యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు ఐలయ్య, రాజేందర్, భరత్ ఉన్నారు.

అన్నదానం

నెన్నెల: పదో తరగతి వరకు నెన్నెలలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తనతో చదివిన చిన్ననాటి మిత్రుడు నిరుసుల్ల రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అతడి జ్ఞాపకార్థంగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం 2006-07పదో తరగతి బ్యాచ్ మిత్రులు బెల్లంపల్లిలోని అమ్మ అనాథ ఆశ్రమంలో కేక్ కట్‌చేసి అనాథలకు నిత్యావసర సరుకులతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిత్రులు సుంకరి తిరుపతి, గడ్డం సందీప్, జంపాల శ్రావన్, నేతకారి కుమార్, మహేష్ పాల్గొన్నారు.

బల్దియాలో పార్కింగ్ పాట్లు

- ప్రధాన రహదారుల్లో ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్
- ఇరుకురోడ్లతో ప్రజలకు తప్పని ఇబ్బందులు



చెన్నూర్ పట్టణంలోని గాంధీచౌక్ వెళ్లే రోడ్డులో షాపుల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు

చెన్నూర్: బల్దియాలో పార్కింగ్ సమస్య తీవ్రమైంది. ప్రధాన రహదారుల్లో ప్రత్యేకించి పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు షాపుల ఎదుట ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రెండు భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పార్కింగ్ చేసిన వాహనాలు తీసేందుకు సైతం స్థలం లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బల్దియాలో పెరిగిన రాకపోకలు..

కొత్తగా ఏర్పడిన బల్దియాలో రాకపోకలు పెరిగాయి. మున్సిపాలిటీలో 25,753 జనాభా, 18వార్డులు ఉన్నాయి. పక్కన ఉన్న కోటపల్లి, వేమనపల్లి మండలాలతో పాటు మహారాష్ట్రకు చెన్నూర్ మున్సిపాలిటీ కేంద్ర బిందువుగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని వాహనాలతో పాటు రెండు మండలాలు, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాల రాకపోకలు పెరిగాయి. రోడ్లు వెడల్పు లేకపోవడంతో ఇరుకు రోడ్లపై వాహనాలు పార్కింగ్‌లు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

ప్రధాన రహదారుల్లో ఎక్కువ ప్రమాదాలు..

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ నుంచి గాంధీచౌక్ మీదుగా స్టేట్‌బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌తో పాటు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ రహదారులలోనే వ్యాపారసంస్థలు ఉన్నాయి. వ్యాపార లావాదేవీలతో పాటు బ్యాంక్‌లు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో రోడ్డు నిత్యం జనంతో బీజీగా ఉంటుంది. అంతే కాకుండా కోటపల్లి, వేమనపల్లి మండలాలకు ఆర్టీసీ బస్సులు సైతం వెళ్తుంటాయి. పాత బస్టాండ్ నుంచి చెరువు కట్ట వరకు ప్రత్యేక పార్కింగ్ లేకపోవడంతో పాటు షాపుల ఎదుట ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో రెండు వాహనాలు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. దీంతో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల గాంధీచౌక్ ప్రాంతంలో ఒక వ్యాపారి పిల్లలతో కొత్తబస్టాండ్‌కు స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొనడంతో పిల్లలు కిందపడ్డారు. ఇరువురు గాయాల పాలయ్యారు. రాజీవ్‌రోడ్డులో ఇదే పరిస్థితి నెలకొంది.

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత..

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత మాస్టర్‌ప్లాన్‌తో రోడ్లు వెడల్పు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించినప్పటికీ, రోడ్ల వెడల్పు కార్యక్రమానికి పూనుకోవడం లేదు. దీంతో పార్కింగ్ కష్టాలు తీవ్రమయ్యాయి. పట్టణాభివృద్ధిలో భాగంగా అధికారులు రోడ్లు వెడల్పు చేసి, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేస్తే, ప్రమాదాలు నివారించవచ్చని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాలేదు

మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా కొత్త మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ చేయాలని ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఇప్పటివరకు చెన్నూర్ మున్సిపాలిటీకి మాస్టర్ ప్లాన్ చేయాలని ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. మాస్టర్ ప్లాన్ చేస్తే ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. పార్కింగ్ సమస్య తీరుతుంది.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న బోడ జనార్దన్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బోడ జనార్దన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 33పోలింగ్ బూత్‌ల కన్వీనర్‌లతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వెంకటేష్ నేతను చెన్నూర్ అసెంబ్లీ బరిలో నిలిపితే మోసం చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి పలువురు ఆశవహులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అధిష్టానం ఆదేశిస్తే తాను పోటీ చేస్తానని, అంతేకాకుండా బరిలో నిలిపిన నాయకుడి గెలుపుకోసం అందరితో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మంతెన శ్రీనివాస్, దేవికుమార్, బద్రి, సత్యనారాయణ, పవన్‌కుమార్, రవీందర్, మొగిలి రఘు, ప్రసాద్, రజిత తదితరులు ఉన్నారు.

చెన్నూర్: కాంగ్రెస్ పార్టీతో ప్రజా సంక్షేమ పాలన సాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ తెలిపారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకాగౌడ్, శ్రీధర్, కృష్ణాగౌడ్ మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన పలువురు ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముల్కల్లకు చెందిన గడ్డం కుమార్‌యాదవ్, బైరం లక్ష్మి, చుక్కయ్య, రమేశ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ప్రేమ్‌సాగర్‌రావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి

నస్పూర్: సింగరేణి కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ రావు తెలిపారు. సీసీసీలోని సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆదివారం టీపీసీసీ ఎన్నికల కమిటీ మెంబర్‌గా ప్రేంసాగర్‌రావు నియమితులైన సందర్భంగా ఆయనకు రిటైర్డ్ కార్మికులు అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి విప్లవ జోహార్లు అర్పిస్తున్న కృష్ణ

దండేపల్లి: ప్రజాకవి గద్దర్ మరణంపై దండేపల్లిలో ఆదివారం పీడీఎస్‌యూ, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద గద్దర్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పిట్టల తిరుపతి, ఆదివాసీ సంఘాల నాయకులు కోట్నాక తిరుపతి, కనక జంగు, సోము, లాల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆకస్మిక మృతికి మందమర్రి పట్టణంలోని పలు ప్రజాసంఘాల నాయకులు, పార్టీ నేతలు ఆదివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించారు.

బెల్లంపల్లి: విప్లవ గాయకుడు, ప్రజాయుద్ధనౌక గద్దర్ సంతాప సభను కొత్తబస్టాండ్‌ఏరియాలో ఆదివారం నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, వెంకటేశ్, రాజేంద్రప్రసాద్, అరుణ్, ఆకాశ్, రాజారాం, విఠల్, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గద్దర్ మరణం పేదలకు తీరని లోటని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్ అన్నారు.

'పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ మాదిగలకే ఇవ్వాలి'



మాట్లాడుతున్న మధురాజ్

చెన్నూర్: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 2.70లక్షల మంది మాదిగలు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు ఎంపీ టిక్కెట్‌తో పాటు రెండు ఎమ్మెల్యే సీట్లను మాదిగలకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, మంథని, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లోని మాదిగలు ఈ నెల 20న పెద్దపల్లి ఎస్‌ఎస్ గార్డెన్‌లో సమావేశం ఏర్పా టు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో బీజేపీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేసే బిల్లుకు ఆమోదం ముద్ర వేసిన గవర్నర్ తమిళిసై చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, నాయకులు తుల అంజనేయులు, తోట మల్లికార్జున్, హరికృష్ణ, రమేష్, సంతోస్, రాజమౌలి, పచ్చ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిచి చూపిస్తా'



పథకాలు వివరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: బీజేపీ అధిష్టానం తనకు చెన్నూరు నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ఇస్తే, ప్రజల ఆశీర్వాదంతో తప్పక గెలిచి చూపిస్తానని బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాది గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగివేశారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు జంగపల్లి మల్లయ్య, గజ్జల వెంకన్న, క్రాంతి కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

13న మెగా హెల్త్‌క్యాంప్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో ఈ నెల 13వ తేదీన గొంగ్లళ్ల శంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం మెడిలైఫ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గుండె, చాతి, నరాలు, ఎముకలు, కిడ్నీ, గైనకాలజిస్టు, కాలేయ వంటి వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఒకరోజు ముందుగానే వైద్య సేవలు పొందేవారు పేర్లు నమోదు చేసుకోవాలని, ఇందుకోసం 9120108108, 8121081080 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

హమాలీ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

మంచిర్యాలటౌన్: జిల్లా హమాలీ సంఘం ఎన్నికలను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో అధ్యక్షుడిగా చిట్టివుని లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్ గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు, సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ తలిపారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మకు చెందిన ఆటో డ్రైవర్ కొక్కిస నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి కార్మ్కారి ట్రస్టు చైర్మన్ కార్మ్కారి సురేందర్ ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

క్యాన్సర్ బాధితురాలికి...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన మిత్రబృందం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అదే కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలికి రూ.36వేలను జమచేసి అందించారు. గతంలోనూ బాధితురాలికి అనారోగ్యం కాగా, ఆసుపత్రి చికిత్స నిమిత్తం రూ.10వేలను అందించగా, క్యాన్సర్‌గా నిర్ధారణ కావడంతో, మరింత సాయం చేసేందుకు మిత్రబృందం ముందుకు రావడంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల కృష్ణ, కారుకూరి చంద్రమౌళి, మద్దుల మనోహర్ రెడ్డి, కొత్త సురేందర్, జూపాక సుదీర్, వడ్డే వినయ్ కుమార్, తనకు శ్రీనివాస్, కొంకుముట్టి మహేశ్, పాలమాకులు వెంకటరెడ్డి, చేకూర్తి రోసిరెడ్డి, బండా నాగేశ్వర్‌రావు, పాడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటా బ్లీచింగ్ పౌడర్ పంపిణీ

తాండూర్: గ్రామపంచాయతీ ప్రజలకు ఆదివారం బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేశారు. పంచాయతీ వార్డు సభ్యురాలు యాస్మిన్‌బాను, యువ నాయకుడు బాబుఖాన్ ఆధ్వర్యంలో పంచాయతీలోని 4వ వార్డులో ఇంటింటా బ్లీచింగ్ పౌడర్‌ను అందజేశారు. వార్డుసభ్యురాలు సొంత ఖర్చులతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: ఈ నెల 13న కోరుట్లలో నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్ పిలుపునిచ్చారు. అంగడిబజార్ ఏరియాలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశం, అంజయ్య, లక్ష్మీనారాయణ, కొంపెల్లి రమేష్, సత్యనారాయణ, శంకరయ్య తదితరులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తాండూర్: మండల మేరు సంఘం ఎన్నికలను ఆదివారం సురభిఫంక్షన్ హాల్లో సంఘం రాష్ట్ర అడ్‌హక్ కమిటీ సభ్యుడు, జిల్లా ఎన్నికల కన్వీనర్ గట్ల చందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో తాండూర్ మండల మేరుసంఘం గౌరవ అధ్యక్షుడిగా రామగిరి ప్రవీణ్, అధ్యక్షుడిగా మంతెన శివకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మంతెన వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామగిరి చంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?



దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గుంతలతో అధ్వానంగా ఉంది. వర్షం పడితే చాలు నీళ్లు నిలుస్తున్నాయి. అటుగా వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.

జయశంకర్ సార్ జయంతి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పార్టీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత అని, రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన కృషిని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్





భీమారంలో నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



జన్నారం: పూలమాలలు వేస్తున్న నాయకులు



చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...



బెల్లంపల్లి: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు





మందమర్రిలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



కోటపల్లి: నివాళులర్పిస్తున్న ఎంపీపీ



కన్నెపల్లిలో నివాళులర్పిస్తున్న సర్పంచ్



దండేపల్లిలో...



దొనబండలో...



జైపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ముత్తరావుపల్లిలో...

అన్నదానం

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లికి చెందిన కాయేలికారి రాజశేఖర్(బన్ని) ఇటీవల మృతి చెందగా, ఆయన చిన్ననాటి స్నేహితులు ఆదివారం సాయిదృష్టి అంధుల, వయో వృద్ధాశ్రయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.